సాక్షి నంద్యాల

ఆదివారం । 5 । నవంబర్ । 2023




మహానందిలో భక్తుల సందడి

మహానంది: మహానందిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. భక్తులు కోనేర్లలో స్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేపట్టారు.



ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మిగనూరు ఉన్నత పాఠశాల మైదానంలో రాష్ట్ర స్థాయి అండర్ -17 బాలుర ఫుట్‌బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 8లో▸



నెలాఖరు వరకే ఎల్లెల్సీకి నీరు

తుంగభద్ర జలాశయంలో ఈ ఏడాది నీటి నిల్వ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఈ నెలాఖరు వరకే తుంగభద్ర దిగువ కాలువకు నీరు వదలనున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. 8లో▸

న్యూస్‌రీల్

మహానందిలో లోకాయుక్త ఐజీ పూజలు



ఆలయ ఆవరణలో లోకాయుక్త ఐజీ నరసింహారెడ్డి

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఏపీ లోకాయుక్త ఐజీ (ఇన్వెస్టిగేషన్ డైరెక్టర్) కె. నరసింహారెడ్డి, డీఎస్పీ తిరుపాల్‌రెడ్డి శనివారం పూజలు నిర్వహించారు. సీఐ రవీంద్ర, మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ వారికి స్వాగతం పలికి పూజలు నిర్వహింపజేశారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.

మద్దిలేటయ్యకు శనివారం ఆదాయం రూ.8.13 లక్షలు



భక్తులతో కిక్కిరిసిన మద్దిలేటి నరసింహ స్వామి ఆలయ ప్రాంగణం

బేతంచెర్ల: ఆర్ఎస్ రంగాపురం శివార్లలో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామికి ఆశ్వీయుజ శనివారం సందర్భంగా రూ. 8.13 లక్షల ఆదాయం వచ్చింది. స్వామి వారం శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా భక్తులు స్వామి వారిని సేవించడంతో ఆలయానికి రూ.8,13,785 ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఆలయంలో వరుణయాగం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కర్నూలు, కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాలపై 7న సమీక్ష

కర్నూలు(సెంట్రల్): కర్నూలు, కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఈనెల 7న కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించనున్నారు. ఇన్‌చార్జి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమీక్షకు జిల్లా మంత్రితో పాటు సంబంధిత నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. కాగా, ఆయా నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదికలను తయారు చేయాలని సీపీఓ జేడీని కలెక్టర్ ఆదేశించారు.

రెండో విడత పీజీ కౌన్సెలింగ్‌కు రేపటి నుంచి రిజిస్ట్రేషన్

కర్నూలు (న్యూటౌన్): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో రెండో విడత పీజీ కౌన్సెలింగ్‌కు సోమవారం నుంచి https://pgcet&sche.aptonline.in/APPGCET వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ పీజీ సెట్-2023లో అర్హత సాధించిన విద్యార్థులు మాత్రమే ఇందుకు అర్హులని పేర్కొన్నారు. ఎంఏ ఇంగ్లిష్, ఎకనామిక్స్, ఉర్దూ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, బాటనీ, జువాలజీ, ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ కోర్సుల్లో చేరవచ్చని తెలిపారు. ఈ నెల 7 నుంచి 10 వరకు సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలని, ఈ నెల 13 నుంచి 15లోగా వెబ్ ఆప్షన్స్‌లో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీని ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ నెల 18న విద్యార్థులకు సీట్ల కేటాయింపు జరుగుతుందని, 20 నుంచి 23వ తేదీలోగా యూనివర్సిటీలో రిపోర్ట్ చేసుకోవాల్సి ఉందని తెలిపారు.

వినూత్న ఒరవడి.. పొలం బడి

- సత్ఫలితాలిస్తున్న వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం
- శాస్త్రీయ విధానాలు, సలహాలతో రైతులకు అవగాహన
- విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు శిక్షణ తరగతులు
- 20 మండలాల్లోని 46 ఆర్బీకేల పరిధిలో నిర్వహణ

ఎంపికైన మండలాలు - 20 / ఎంపిక చేసిన ఆర్బీకేలు - 46
ఎంపికైన పంటలు - 6 / నిర్వహించాల్సిన పొలం బడులు - 644



బాచేపల్లి తండాలో శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



ధాన్యం నిల్వపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆళ్లగడ్డ: ఆరుగాలం శ్రమించినా ఆశించిన దిగుబడులు రాక.. సరైన గిట్టుబాటు ధర అందక.. మార్కెటింగ్‌పై అవగాహన లేక నష్టపోతున్న అన్నదాతలను ఆదుకునేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా వెన్నుదన్నుగా నిలుస్తోంది. మూస పద్ధతిలో వ్యవసాయం చేస్తున్న రైతులను ఆధునిక పద్ధతిలో పయనింప జేసేందుకు అవగాహన కల్పిస్తోంది. తక్కువ పెట్టుబడితో రెట్టింపు దిగుబడులు సాధించే దిశగా నడిపించేందుకు చేపడుతున్న 'వైఎస్సార్ పొలంబడి' కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లాలో 2023 - 24 వ్యవసాయ సంవత్సరానికి 20 మండలాలను ఎంపిక చేశారు. ఆయా మండలాల్లోని 46 రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఆరు రకాల పంటలను ఎంపిక చేసి ఒక్కో పంటకు 25 నుంచి 30 మంది రైతులకు పొలంబడితో అవగాహన కల్పిస్తున్నారు. దీంతో రైతులు లాభాల దిశగా పయనిస్తున్నారు. వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నారు. వారానికోసారి క్షేత్రస్థాయి పరిశీలన చేపడుతూ.. సాగులో మెలకువలు నేర్పిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు.

రైతులే శాస్త్రవేత్తల్లా మారేలా..

ఎంపిక చేసిన ప్రతి ఆర్బీకే పరిధిలో వారానికోరోజు నిర్దేశించిన రైతు వ్యవసాయ క్షేత్రంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పరిసర ప్రాంతాల్లోని 30 మంది రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వారితో చర్చించి తొలుత పొలంలో మార్పులు గుర్తిస్తారు. తర్వాత రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటారు. చీడ పీడలు, సస్యరక్షణలో భాగంగా ఎరువుల వాడకం, రసాయనాల పిచికారీ ఎలా చేయాలన్న దానిపై వ్యవసాయాధికారులు సలహాలు ఇస్తారు. తక్కువ పెట్టుబడితో నికర ఆదాయం ఎలా పొందాలో క్షుణ్ణంగా వివరిస్తారు. భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువుల వాడకంపై ప్రయోగాత్మకంగా వివరిస్తారు. విత్తన శుద్ధితో చీడపీడల నివారణ గురించి శిక్షణ ఇస్తారు. అంతరపంటల ద్వారా మిత్ర పురుగుల వృద్ధిపై శిక్షణ ఇస్తారు. అలాగే యాంత్రీకరణలో భాగంగా సాగు ఉపకరణాలు రాయితీపై ఎలా పొందొచ్చు, యంత్రాల సాగు ఎలా ప్రారంభించాలి తదితర వివరాలను 'పొలం బడి'లో వివరిస్తున్నారు. నిత్యం రైతు భరోసా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ, ఉద్యానశాఖల సహాయకులు రైతులకు అందుబాటులో ఉంటూ చీడపీడల నుంచి పంటలను రక్షించుకుని దిగుబడులు పెంచుకునేలా తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తూ..

మరో వైపు రైతులు పండించిన పంటలకు మార్కెటింగ్, ఎగుమతుల అవకాశాలను వివరిస్తూ తగిన గిట్టుబాటు ధర కల్పించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పంట దిగుబడులు నాణ్యత కలిగి ఉండేలా చూస్తే అధిక ధర లభిస్తుందని, అందుకోసం నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలని సూచిస్తున్నారు. ధాన్యంలో రసాయన అవశేషాలు ఎంత తక్కువగా ఉంటే అంత అధిక ధరకు విక్రయించుకోవచ్చని సూచిస్తున్నారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని పంటలు సాగు చేసే రైతులతో సంఘాలు (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) ఏర్పాటు చేస్తున్నారు. మార్కెట్ మోసాలకు తావులేకుండా పండిన ఉత్పత్తులను రైతులంతా సమష్టిగా మార్కెటింగ్ చేసుకునేందుకు కావల్సిన సదుపాయాలను కల్పిస్తున్నారు.

పొలంబడికి ఎంపిక చేసిన పంటలు, ఆర్బీకేలు

వరి	బాచేపల్లి, శిరివెళ్ల -4, గోవిందపల్లి -1, నెహ్రూనగర్, శ్రీరంగాపురం, మొత్కూరు, బోయరేవుల, ముచ్చుమర్రి, 80.బన్నూరు, ఆలమూరు, ఈర్నపాడు, కైప, దుర్వేశి, బొల్లవరం, అవుకు-2, మెట్టుపల్లె, అయ్యలూరు-1,
మినుము	పేరూరు, శెట్టివీడు, ఆకుమల్ల, నందికొట్కూరు,
కంది	ఆత్మకూరు అర్బన్, కురుకుంద, మిట్టకందాల, నందివర్గం, నందవరం-1
పత్తి	దుద్యాల-2, ఎర్రమఠం, దొర్నిపాడు, వందుట్ల
కొర్ర	ఎర్రగుంట్ల,
వేరుశనగ	పెద్దపొదిల్ల, ప్యాపిలి-2, బోతుదొడ్డి, మునిమడుగు, కలచట్ల, ఏనుగుమర్రి, ముద్దవరం, పెండేకల్, గోరుమానుకొండ

శిక్షణ తరగతులు బాగున్నాయి



మేము నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాం. వ్యవసాయశాఖ అధికారులు నిర్వహించే పొలంబడి కార్యక్రమానికి మా పొలాన్ని ఎంపిక చేశారు. 30 మంది రైతులను గ్రూపుగా చేసి వారికి అత్యాధునిక పద్ధతుల్లో వరి పంటలో తీసుకోవాల్సిన సస్యరక్షణ, సంరక్షణ విధానాలను వివరించారు. మా పొలాన్ని ప్రయోగాత్మక క్షేత్రంగా ఎంపిక చేయడంతో పాటు దిగుబడి ఎలా పెంచుకోవాలో శిక్షణ ఇచ్చారు. శాస్త్రీయ విధానాలపై అవగాహన అద్భుతంగా ఉంది. – **లక్ష్మీబాయి, మహిళా రైతు, బాచేపల్లె తండా, ఆళ్లగడ్డ మండలం**

ఖర్చు ఎలా తగ్గించుకోవాలో నేర్చుకున్నా



నేను 9 ఎకరాల సాగు చేసిన మినుము పంటను పొలంబడికి ఎంపిక చేశారు. ఇప్పటికే వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు వచ్చి 4 పొలం బడులు (వారాలు) నిర్వహించారు. చిన్నపాటి మెలకువలతో ధాన్యం నాణ్యత, దిగుబడులు ఎలా పెంచుకోవాలో అవసరమైన శిక్షణ ఇచ్చారు. దుక్కుల నుంచి విత్తనాల ఎంపిక, సేంద్రియ సస్యరక్షణ, మిత్ర పురుగుల సంరక్షణ.. ఇలా అనేక అంశాలపై శిక్షణ ఇవ్వడంతో అనవసర ఖర్చులు తగ్గించుకుని లాభాలు వచ్చేలా నేర్చుకున్నాను. – **తిరుపతిరెడ్డి, రైతు, పేరూరు, రుద్రవరం మండలం**

పొలంబడి ఎంతో ఉపయోగం



క్షేత్రస్థాయిలో పంటల సాగుపై రైతులకు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో ఉపయోగకరంగా మారింది. సాగులో తీసుకోవాల్సిన శాస్త్రీయ మెలకువలపై శిక్షణ ఇవ్వడంతో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి సాధించేందుకు దోహద పడుతుంది. ఎరువుల సమతుల్యం, పురుగు మందుల వాడకం నియంత్రణ, నీటి యాజమాన్యం తదితరాలపై రైతులు అవగాహన పొందుతున్నారు. మొత్తంగా ఈ 14 పొలం బడులు పూర్తయ్యేలోపు ఎంపిక చేసిన ఆ రైతులను శాస్త్రవేత్తలుగా తయారు చేయడమే 'వైఎస్సార్ పొలంబడి' కార్యక్రమం లక్ష్యం.

– రామ్మోహన్‌రెడ్డి, ఏడీఏ, ఆళ్లగడ్డ

అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించాలి



వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించాలని అధికారులు, కాంట్రాక్టర్లను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన డోన్ పట్టణ పరిధిలో రూ.40 కోట్లతో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి భవనంతో పాటు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో రూ.5 కోట్లతో నిర్మిస్తున్న విద్యార్థి వసతి గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా నిర్మాణ పనులను పూర్తి చేస్తే ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు వీలుంటుందన్నారు. అనంతరం నెహ్రూ నగర్‌లోని డాక్టర్ రామసుబ్బయ్య పార్కులో నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్‌ను మంత్రి పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శ్రీనివాసనగర్ పార్కులో సందర్శకుల కోసం రూ. 3 లక్షలతో నిర్మిస్తున్న క్యాంటీన్, మరుగుదొడ్ల నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. మంత్రి వెంట ప్రభుత్వ ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేశ్ తదితరులు ఉన్నారు.

నేడు చిన్నమల్కాపురంలో..

చిన్నమల్కాపురం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో రూ. 4 కోట్ల వ్యయంతో నిర్మించిన రెండు సచివాలయ భవనాలు, రెండు ఆర్బీకేలతో పాటు, సీసీ రోడ్లను, డ్రైనేజీలను ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదివారం ప్రారంభించనున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉమేహానికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చంద్రిక

7న వైఎస్ఆర్ రైతుభరోసా రెండో విడత పెట్టుబడి సాయం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ రైతుభరోసా కింద 2023-24వ సంవత్సరానికి రెండో విడత పెట్టుబడి సాయాన్ని ఈ నెల 7న రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూమి యజమానులకు వైఎస్ఆర్ రైతు భరోసా కింద రూ.2వేలు, పీఎం కిసాన్ కింద రూ.2వేల ప్రకారం మొత్తం రూ.4వేలు విడుదల కానుంది. కర్నూలు జిల్లాలో 2,96,739 మంది రైతులకు రూ.122.58 కోట్లు, నంద్యాల జిల్లాలో 2,33,969 మంది రైతులకు రూ.96.68 కోట్లు లబ్ధి చేకూరనుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా బటన్ నొక్కి బ్యాంకు ఖాతాలకు నగదు విడుదల చేయనున్నారు.

8,132 క్యూసెక్కుల నీటి విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి శుక్రవారం నుంచి శనివారం వరకు దిగువ ప్రాంతాలకు 8,132 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 725 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,380, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. జలాశయంలో 65.7316 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నేడు కూడా పింఛన్ల పంపిణీ

- నాలుగో రోజు 98.12 శాతం పూర్తి
- 6వ స్థానంలో నిలిచిన జిల్లా

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లాలో నవంబర్ నెల వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఆదివారం సెలవు రోజు అయినా పెన్షన్ల పంపిణీకి చివరి రోజు కూడా కావడంతో నేడు కూడా పంపిణీ కొనసాగనుంది. జిల్లాలో 2,22,277 పింఛన్లు ఉండగా... శనివారం సాయంత్రం 5 గంటల సమయానికి 2,18,092 పింఛన్లు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు 98.12 శాతం పూర్తి కాగా రాష్ట్ర స్థాయిలో జిల్లా 6వ స్థానంలో నిలిచింది. వృద్ధాప్య, వికలాంగులు, హెల్త్ పింఛన్లు పొందుతున్న వారిలో 60 ఏళ్లు పైబడిన వారు ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛన్ పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

షేక్ జాఫ్రిన్‌కు సహకార శాఖలో గ్రూప్-1 స్థాయి ఉద్యోగం

నంద్యాల(సెంట్రల్): కర్నూలు నగరానికి చెందిన ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణి షేక్ జాఫ్రిన్‌కు రాష్ట్ర ప్రభుత్వం సముచిత గౌరవాన్ని కట్టబెట్టింది. ఆమెకు సహకార శాఖలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా గ్రూప్-1 ఉద్యోగాన్ని ఇచ్చి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్రీడా రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతను చాటింది. ఈ మేరకు క్రీడా కోటాలో ఆమెకు ఉద్యోగమిస్తున్నట్లు శనివారం జీవో నంబరు-61ని విడుదల చేసింది. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నా రు. కర్నూలుకు చెందిన షేక్ జాఫ్రిన్ తన సంచలన ప్రదర్శనతో దేశం గర్వ పడేలా చేశారు. 2017 డెఫ్ ఒలంపిక్స్‌లో కెప్టెన్‌గా మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత్‌కు కాంస్య పతకాన్ని అందించారు.

క్లుప్తంగా

నెలాఖరు వరకే ఎల్లెల్సీకి నీటి సరఫరా

హొళగుంద: కర్ణాటక రాష్ట్రంలోని తుంగభద్ర జలాశయానికి గత కొద్ది రోజులుగా నీటి చేరిక(ఇన్‌ఫ్లో) నిలిచిపోవడంతో నిల్వ కూడా వేగంగా తగ్గుతోంది. శనివారం నాటికి 105.788 టీఎంసీల పూర్తి సామర్థ్యంలో 29 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 3,336 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉండి 1,633 అడుగుల వద్ద 103.500 టీఎంసీల నీటితో జలాశయం కళకళలాడింది. అయితే ప్రస్తుతం 1,605.50 అడుగల వద్ద 29 టీఎంసీల నీరు ఉండగ 8,976 క్యూసెక్కులను వివిధ కాలువలకు విడుదలవుతోంది. ఈ ఏడాది అనావృష్టి కారణంగా డ్యాంలో ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. ఇక ఎల్లెల్సీ ఆంధ్రలో 250 కి.మీ వద్ద 557 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఈ ఏడాది జలాశయంలో నీటి నిల్వ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఈ నెలఖారు వరకే తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు నీరు వదలనున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు.

లారీ బోల్తా



పాణ్యం: కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై తమ్మరాజుపల్లె గ్రామ సమీపంలో అదుపు తప్పి శనివారం ఉదయం లారీ బోల్తా పడింది. తెలంగాణ రాష్ట్రం జడ్జర్ల నుంచి కోళ్ల లోడ్‌తో నంద్యాలకు వెళ్తున్న లారీ అదుపు తప్పి బ్రిడ్జిని ఢీకొట్టి హైవేపై బోల్తా పడింది. హైవే సిబ్బంది అక్కడికి చేరుకుని గాయపడిన లారీ డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించారు. రహదారిపై అడ్డంగా పడిన లారీని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

సంతానం కలగలేదని బలవన్మరణం



మృతిచెందిన మాధవి

దేవనకొండ: సంతానం కలగలేదని మనస్తాపం చెంది ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శనివారం దేవనకొండలోని బుడగజంగాల కాలనీలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. సుంకన్నతో మాధవి(30)కి 12 ఏళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలగకపోవడంతో మాధవి మనస్తాపం చెందింది. శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. గమనించిన భర్త సుంకన్న ఉరి నుంచి భార్యను దింపి వైద్యం కోసం పత్తికొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి సోదరుడు పెద్ద జమ్మన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తే కేసులు నమోదు చేస్తాం

జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్

కర్నూలు (న్యూటౌన్): అక్రమంగా గ్రావెల్ తరలిస్తే కేసులు నమోదు చేస్తామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. శనివారం కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టుపై ట్రిపుల్ ఐటీకి సంబంధించిన భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వుతుండగా జిల్లా మైనింగ్ అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. టిప్పర్, జేసీబీతో ఎర్రమట్టిని అక్రమంగా తవ్వుతుండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు మండలం బీ తాండ్రపాడుకు చెందిన మస్తాన్, అశోక్‌కు రూ.70వేల అపరాధ రుసుం విధించి, వసూలు చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ వెల్లడించారు. ఈ దాడుల్లో ఏడీ విజిలెన్స్ బైరాగి నాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, నిర్వాహకులు



పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న 13 జిల్లాల విద్యార్థులు

ఎమ్మిగనూరుటౌన్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి.ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అండర్ 17 బాలుర విభాగంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయపతాకంతో పాటు స్పోర్ట్స్ పతాకాన్ని ఆవిష్కరించి, జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధికారులతో చర్చించి రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించేందుకు అనుమతి తీసుకున్నారన్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపే వారిని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి గెలుపోటములు సమానంగా తీసుకోవాలని సూచించారు. పాఠశాలల విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైఎస్‌ఆర్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, ఎంపీపీ కేశన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, ఉమ్మడి కర్నూలు జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు జోసెఫ్ లక్ష్మయ్య.శివకుమార్ ,సెట్కూర్ సీఈఓ రమణ, రాష్ట్ర పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు మొరార్జి, పోటీల రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ ప్రభాకర్, రగ్బీ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు, ఫుట్‌బాల్ కోచ్ మాబు, ఫుట్‌బాల్ అసోసియేషన్ నాయకులు పాల శ్రీనివాసరెడ్డి, విశ్వనాథ్ రమేష్, కె.విశ్వనాథ్, కౌన్సిలర్ కేశవరెడ్డి, హెచ్‌ఎం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలందరూ పాఠశాలల్లో ఉండాలి

● సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): బడిఈడు పిల్లలందరూ నూటికి నూరు శాతం పాఠశాలల్లో ఉండాలని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఉదయం ఆయన విజయవాడ నంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఐదో తరగతి చదివిన వారంతా ఆరో తరగతిలో ప్రవేశం పొందాలన్నారు. బాల్య వివాహాల నివారణకు అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు. రక్తహీనతతో బాధపడే పిల్లలు, మహిళలకు టేక్ హోం కిట్ల ద్వారా పౌష్టికాహారాన్ని సరఫరా చేయాలన్నారు. నాడు–నేడుకు సంబంధించి పాఠశాలలో పెండింగ్ ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వానికి నివేదించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఇన్‌చార్జి సీపీఓ భారతి, సమగ్రశిక్ష అభియాన్ పీఓ వేణుగోపాల్, డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య, డీఐఓ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతి చెందిన తెలుగు ఎర్రబోయిన చిన్నపుల్లయ్య

అవుకు: త్వరలో ఇంటి నిర్మాణ పనులను పూర్తి చేసి గృహ ప్రవేశం చేయాలనుకున్నాడు. అయితే అదే ఇంటిలో విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాడు. అవుకు పట్టణానికి చెందిన తెలుగు ఎర్రబోయిన చిన్న పుల్లయ్య(35) అనే వ్యక్తి గౌండ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇతనికి భార్య వరలక్ష్మి, కుమార్తె ఉన్నారు. వారు ఉన్న ఇళ్లు పూర్తిగా పాడుబడటంతో పడగొట్టి అక్కడే నూతన ఇంటి నిర్మాణం పనులు మొదలు పెట్టాడు. శనివారం ఉదయం 6.30 గంటల సమయంలో ప్లాస్టింగ్ చేసిన సిమెంట్ గోడలను చిన్న పుల్లయ్య నీటితో తడిపేందుకు వెళ్లాడు. ఆ సమయంలో మోటార్‌కు ఉన్న విద్యుత్ తీగలకు జాయింట్ ఉండంతో ప్రమాదవశాత్తూ తగిలి విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయాడు. తండ్రి మొబైల్‌కు ఫోన్ రావటంతో ఇచ్చేందుకు వెళ్లిన కుమార్తె విగతజీవిగా పడిపోయిన తండ్రిని చూసి గట్టిగా కేకలు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు వచ్చి అపస్మారకస్థితిలో ఉన్న చిన్నపుల్లయ్యను అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు చలా విఘ్నేశ్వర్ రెడ్డి, దుగ్గిరెడ్డి రవీంద్ర నాథ్ రెడ్డి తదితరులు ఆసుపత్రి వద్దకు చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విష్ణునారాయణ తెలిపారు.

అనుమానంతో అంతమొందించాడు

● భార్య హత్యకేసులో భర్త అరెస్ట్



హత్య కేసు నిందితుడిని చూపిస్తున్న డీఎస్పీ వెంకటరామయ్య

కోవెలకుంట్ల: కొలిమిగుండ్ల మండలం గొర్విమానుపల్లె గ్రామంలో మూడు రోజుల క్రితం మహిళ అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. అనుమానంతో భార్యను అంతమొందించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. కోవెలకుంట్ల పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య కేసు వివరాలు వెల్లడించారు. గొర్విమానుపల్లె గ్రామానికి చెందిన నారబోయిన నాగరాజుకు వైఎస్సార్ జిల్లా పుట్లూరు మండలం డక్కలపల్లె గ్రామానికి చెందిన ధనలక్ష్మితో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. పిల్లలు పుట్టలేదనే సాకుతో భార్యను తరచూ వేధిస్తుండటమే కాకుండా ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. భార్యాభర్తల మధ్య సయోధ్య కుదిర్చేందుకు గ్రామ పెద్దలు, కుటుంబ పెద్దలు పలుమార్లు పంచాయతీ చేశారు. అయినప్పటికీ నాగరాజులో మార్పు రాలేదు. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదీన భార్యభర్తల మధ్య గొడవ చోటు చేసుకుంది. ఈ క్రమంలో ధనలక్ష్మి కింద పడటంతో పక్కనే ఉన్న కర్ర సాయంతో గొంతు నులిమి హత్య గావించాడు. హతురాలి మేనమామ ఆదినారాయణ ఫిర్యాదు మేరకు కొలిమిగుండ్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు మూడు రోజుల వ్యవధిలో కేసును ఛేధించి కొలిమిగుండ్ల బస్టాండ్ సమీపంలో నాగరాజును అరెస్ట్ చేసి హత్యకు ఉపయోగించిన కర్రను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు డీఎస్పీ వెల్లడించారు. కేసును ఛేధించిన కోవెలకుంట్ల సీఐ రామానుజులు, కొలిమిగుండ్ల ఎస్‌ఐ రమేష్‌రెడ్డిని డీఎస్పీ అభినందించారు.

ఈ–క్రాప్ బుకింగ్ సంపూర్ణం

కర్నూలు (అగ్రికల్చర్): 2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ బుకింగ్ ప్రక్రియ సంపూర్ణంగా ముగిసింది. క్షేత్రస్థాయిలో పంటల నమోదు కార్యక్రమం అక్టోబర్ నెల 10వ తేదీతో ముగిసినప్పటికి రైతులతో ఈ–కేవైసీ చేయించడం, సూపర్ చెక్ నిర్వహించడం, సోషల్ ఆడిట్, గ్రామసభల నిర్వహణ తదితర కార్యక్రమాలు సుదీర్ఘంగా చేపట్టారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఎలాంటి పొరపాట్లకు, లోపాలకు తావు లేకుండా ఈ–క్రాప్ బుకింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో 10,17,374 ఎకరాల్లో సాగు చేసిన పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేశారు. అయితే 9,73,650 ఎకరాలకు సంబంధించి 3,25,851 మంది ఈ–కేవైసీ ద్వారా సాగు చేసిన పంటలను ధృవీకరించారు. ఈ–కేవైసీ 95.80 శాతం పూర్తయింది. ఈ–క్రాప్ డేటాను త్వరలో బీమా కంపెనీలకు ఇవ్వడానికి వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది.

రైతుల సంఖ్య	సాగు చేసిన పంట	విస్తీర్ణం (ఎకరాల్లో)
2,10,397	పత్తి	5,00,975
75,208	ఎండుమిర్చి	1,48,447
34,753	వేరుశనగ	77,165
25,461	ఉల్లి	41,696
21,347	వరి	31,267
47,311	కంది	89,492

బైక్‌ల దొంగ అరెస్ట్

● 10 బైకులు స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: నంద్యాల, వైఎస్సార్ జిల్లాల్లో 10 బైకులను అపహరించిన దొంగను శనివారం ఆళ్లగడ్డ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం తాళ్లమాపురం గ్రామానికి చెందిన షేక్ దస్తగిరి గతంలో ప్రొద్దుటూరులో పలు బైకుల చోరీకి పాల్పడిన కేసులో నిందితుడు. ఈ క్రమంలో సెప్టెంబర్ 15వ తేదీ ఆళ్లగడ్డ పట్టణంలో పల్సర్ బైకును అపహరించాడు. బాధితుడు సర్తాజ్ నవాజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల 31వ తేదీ ఆళ్లగడ్డ పట్టణంలోని పీవీఎస్సార్ గోడౌన్ వద్ద షేక్ దస్తగిరి అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారించగా బైకుల చోరీకి పాల్పడుతున్నట్లు తేలింది. ఆళ్లగడ్డలో అపహరించిన పల్సర్ బైకుతో పాటు మరో 9 బైకులు స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య, సీఐ రమేష్‌బాబు, ఎస్‌ఐ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిలో వ్యభిచార ముఠా అరెస్ట్

ఆదోనిఅర్బన్: వ్యభిచార ముఠాను అరెస్ట్ చేసినట్లు ఆదోని త్రీటౌన్ సీఐ నరసింహరాజు శనివారం విలేకరులకు తెలిపారు. తిరుమలనగర్ ఆల్ బ్యాంకర్స్ కాలనీలోని ఓ ఇంట్లో టైలరింగ్ శిక్షణ పేరుతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తమకు పక్కా సమాచారం వచ్చిందన్నారు. ఎస్‌ఐలు విజయలక్ష్మి, జయశేఖర్ నేతృత్వంలో దాడులు నిర్వహించి ఇద్దరు మహిళలతో పాటు ఏడుగురు విటులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కలకత్తా, బెంగళూరు, కర్నూలు వివిధ ప్రాంతాల నుంచి అమ్మాయిలను పిలిపించి వ్యభిచారం చేయిస్తున్నట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. వారి నుంచి రూ.11,200 నగదు, రెండు సెల్‌ఫోన్‌లు, మూడు కండోమ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. వ్యభిచార ముఠా గుట్టురట్టు చేసిన పోలీసులను ఎస్పీ కృష్ణకాంత్, డీఎస్పీ శివనారాయణస్వామి అభినందించారు.

రైలు ప్రమాద మృతుని కుటుంబానికి ప్రభుత్వం అండ

● రూ.20 లక్షల ఆర్థికసాయం అందజేసిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



మృతిని తల్లిదండ్రులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి: రైలు ప్రమాద మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. విజయనగరం జిల్లాలో అక్టోబర్ 29వ తేదీన జరిగిన రైలు ప్రమాదంలో కోసిగి మండలం అగసనూరు గ్రామానికి చెందిన చాకలి తాయప్ప(21) మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసేందుకు వెళ్తూ ఈ యువకుడు మృతి చెందాడు. మృతుని కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రైల్వే శాఖ నుంచి రూ.10లక్షలు ఆర్థిక సాయం మంజూరైంది. శనివారం మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి చేతుల మీదుగా చెక్కును గ్రామస్తుల సమక్షంలో ఆ యువకుడి తల్లిదండ్రులు చాకలి పాలన్న, నాగమ్మకు అందజేశారు. కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. అధైర్యపడవద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామ సర్పంచ్ ఉలిగయ్య, మాజీ సర్పంచ్ ఆకాష్ రెడ్డి, ఎంకే నాగేష్, హనుమప్ప, బాబు రెడ్డి, కర్రెప్ప, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం



సంఘీభావాన్ని తెలియజేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులు

● జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు(న్యూటౌన్): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి అన్నారు. కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం బడుగు, బలహీన వర్గాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన చారిత్రక అవసరం ఎంతైనా ఉందన్నారు. కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ విజయమనోహరి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, వైఎస్సార్‌సీపీ నేత అహ్మద్ అలీఖాన్, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ యూనుస్‌బాషా, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో జగనన్నను జై కొడదామన్నారు. రిటైర్డ్ తహసీల్దార్ రోషన్ అలీ, నాయకులు అజయ్‌కుమార్, గోనెగండ్ల మురళీ నాయుడు, చంద్రకళ, చంద్రికమ్మ, జమీలమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మొదటి రోజు విశేష స్పందన

● ఓటరు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను స్వీకరించిన బీఎల్ఓలు



పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్‌డీఓ హరిప్రసాద్

కర్నూలు(సెంట్రల్): ప్రత్యేక ఓటరు అవగాహన సదస్సులకు మొదటిరోజు విశేష స్పందన లభించింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని 2,186 పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక ఓటరు అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో బూత్ లెవల్ ఆఫీసర్లు అందుబాటులో ఉండి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు కూడా అవగాహన సదస్సుల్లో భాగమై అనుమానం ఉన్న ఓటర్ల తొలగింపు, 18 ఏళ్లు నిండిన వారిని చేర్పించేందుకు దరఖాస్తులు ఇచ్చారు. ప్రత్యేక ఓటరు అవగాహన సదస్సులు ఆదివారం కూడా అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. ప్రస్తుత ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 19,71,325 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 9,78,663, మహిళలు 9,92,356, ఇతరులు 306 మంది ఉన్నారు.